



మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్‌లో సంచరిస్తున్న కుక్కలు

భౌ..బోయ్..



- ఉమ్మడి పాలమూరు జిల్లాలో పెరుగుతున్న కుక్కకాటు బాధితులు
- చిన్నపిల్లలు, మూగజీవాలపై దాడి
- ఏటా 15 వేల మంది వరకు కుక్క కాటు
- గత ఏడాది 14,491 మందికి..
- పేరుకే జంతు జనన నియంత్రణ.. మునిసిపాలిటీల్లోనూ నామమాత్రమే
- గ్రామాల్లో నియంత్రణ కరువు.. గుంపులుగా సంచారంతో బెంబేలు



వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురంలో గుంపుగా సంచరిస్తున్న కుక్కలు

మహబూబ్‌నగర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి పాలమూరు జిల్లాలో కుక్కకాటు బాధితులు పెరిగిపోతున్నారు. స్టెరిలైజేషన్ ప్రక్రియ సరిగా లేకపోవడం, జనన నియంత్రణ చేపట్టకపోవడం వంటి కారణాలతో ఏటా వాటి జనాభా పెరుగుతోంది. వాటికి సరైన ఆహారం లేక మనుషులు, మూగ జీవాలపై దాడులు చేస్తున్నాయి. పేరుకు కొన్ని మునిసిపాలిటీల్లో జంతు జనన నియంత్రణ కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ.. అవి ఆశించిన ఫలితాలు ఇవ్వడం లేదు. గ్రామాల్లో అయితే అసలు ఆ దిశగా చర్యలు ఉండటం లేదు. కుక్కలను పట్టి ఇతర ప్రాంతాలకు తరలించాలని భావిస్తున్నప్పటికీ.. జంతు సంరక్షణ కమిటీల సభ్యులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా చిన్న పిల్లలతో పాటు మూగ జీవాలు కుక్కల దాడుల బారిన పడుతున్నాయి. కుక్క కాటేస్తే రేబిస్ రాకుండా నియంత్రించే మందులు అందుబాటులో ఉంచే చర్యలు తప్ప.. నిర్దుష్టంగా వాటిని అరికట్టడానికి మాత్రం చర్యలు ఉండటం లేదు. ఇటీవల హైదరాబాద్‌లోని వనస్థలిపురానికి చెందిన ఎంతః విక్రమాదిత్య అనే వ్యక్తి- కుక్కల దాడిలో స్కూల్ విద్యార్థి మృతి చెందిన వైనంపై హైకోర్టులో ప్రజాప్రయోజన వాజ్యం దాఖలు చేశారు. ఈ సందర్భంగా హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. 'మనుషులపై వీధి కుక్కల దాడులను ఎలా నియంత్రిస్తారో చెప్పాలి. కేవలం కమిటీలు వేసి చేతులు దులుపుకోకుండా.. పరిష్కార మార్గాలను అన్వేషించాలి. జంతుసంరక్షణ సంఘాలతో చర్చలు జరిపి.. తగిన చర్యలు తీసుకోవాలి. హెల్ప్‌లైన్ ఏర్పాటును పరిశీలించాలి' అని కోర్టు ఆదేశించింది. ఈ సందర్భంగా ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించి.. సుప్రీం కోర్టు మార్గదర్శకాల ప్రకారం యానిమల్ బర్త్ కంట్రోల్ చేపడుతున్నట్లు తెలిపారు. అయితే ఇది ఒక జీహెచ్‌ఎంసీకి మాత్రమే పరిమితం కాలేదు. జంతు జనన నియంత్రణ కేంద్రాలను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తేవాల్సిన అవసరం ఉంది. మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాలో ఏటా 15 వేలకుపైగా కుక్కకాటు కేసులు నమోదవుతున్నాయి. గతేడాది 14,491 కేసులు నమోదు కాగా.. ఈ ఏడాది ఏడు నెలల్లోనే 10,063 కేసులు నమోదు కావడం గమనార్హం.

కుక్క కాటు బాధితుల వివరాలు		
జిల్లా పేరు	2023	2024 (ఇప్పటి వరకు)
మహబూబ్‌నగర్	8774	3327
గద్వాల	1455	850
వనపర్తి	1698	746
నాగర్‌కర్నూలు	1473	2225
నారాయణపేట	1091	2915
మొత్తం	**14491**	**10063**

నష్టపరిహారం చెల్లించాలి



గత నెల 16వ తేదీన గొర్రెలను మేపుకుని వచ్చి, నా గొర్రెలతోపాటు మరో వ్యక్తి గొర్రె పిల్లలను కంచెలోకి వదిలాం. కుక్కలు పదుల సంఖ్యలో వచ్చి దాడి చేయడంతో 58 గొర్రె పిల్లలు మృతిచెందాయి. దాదాపు రూ.ఏడలక్షల నష్టం వాటిల్లింది. ఇలా మూగజీవాలపైనే కాదు.. మనుషులపైనా కుక్కలు దాడులు చేస్తున్నాయి. కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని గ్రామ సర్పంచుకు, కార్యదర్శికి ఫిర్యాదులు చేశాం. అయినా ఎలాంటి మార్పు లేదు. దయచేసి వాటిపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న తమకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలి.

- రాములమ్మ, గొర్రెల పెంపకందారు, మియాపూర్, వనపర్తి జిల్లా

గ్రామాల్లో స్వైర విహారం..

వీధి కుక్కల నియంత్రణ కోసం మునిసిపాలిటీల్లో కొద్దిమేర చర్యలు తీసుకుంటున్నప్పటికీ.. గ్రామాల్లో మాత్రం చర్యలు శూన్యమేనని చెప్పొచ్చు. పదుల సంఖ్యలో కుక్కలు వీధుల్లో స్వైర విహారం చేస్తున్నాయి.

- గత నెల 16న వనపర్తి జిల్లా చిన్నంబావి మండలంలోని మియాపూర్ గ్రామానికి చెందిన ఓడే రాములమ్మ అనే గొర్రెల పెంపకందారు షెడ్డులో దూరిన కుక్కలు దాడి చేయడంతో 58 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. దాదాపు రూ.7 లక్షల మేర నష్టం వాటిల్లింది.
- వనపర్తి మండలం కాశీంనగర్‌లో తొమ్మిది మేకలు కుక్కల దాడిలో చనిపోయాయి. అలాగే గద్వాల జిల్లా అయిజ పట్టణంలో ఇటీవల ఓ బాలుడిని కుక్కలు కాటువేశాయి. ఇదే జిల్లా వడ్డేపల్లిలోని బుడమొర్సు గ్రామంలో మే 23వ తేదీన కుక్కలు దాడిచేయడంతో ఆరుగురు చిన్నపిల్లలు గాయపడ్డారు.
- మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలంలో పరిస్థితి దారుణంగా ఉంది. ఒక్క జూలై నెలలోనే 14 మంది కుక్కకాటు బారిన పడగా.. సోమవారం మండలంలోని చిలివేరు గ్రామంలో ఒక బాలుడు ఇంటివద్ద ఆడుకుంటుండగా.. కుక్కకాటుకు గురయ్యాడు. గండీడ్ మండలంలో గడిచిన మూడు నెలల్లో 28 మంది కుక్కకాటుకు గురయ్యారు.
- కొల్లాపూర్ పట్టణంలో మే 30వ తేదీన ఇంటి ఎదుట ఆడుకుంటున్న నాలుగు సంవత్సరాల చిన్నారిపై కుక్కదాడి చేయడంతో ముఖంపై తీవ్ర గాయం అయ్యింది. హైదరాబాద్‌కు తరలించి ఆపరేషన్ చేయించడంతో రూ.లక్ష ఖర్చు వచ్చిందని బాధితులు తెలిపారు. ఇలా ప్రతీ గ్రామంలో కుక్కకాటు వల్ల బాధితులు పెరుగుతున్నారు. గ్రామాల్లో కార్యదర్శికి, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినా ఫలితం ఉండటం లేదని బాధితులు వాపోతున్నారు.
- ఇవే కాకుండా కోతికాటు, పాముకాటు కూడా ఎక్కువగా నమోదవుతున్నాయి. పాము కాటుకు గురై చాలామంది ప్రాణాలు కూడా కోల్పోతున్నారు. 2023 సంవత్సరంలో ఉమ్మడి జిల్లాలో 1,181 మంది పాముకాటుకు గురికాగా.. 2024 జూలై వరకు 395 మంది పాముకాటు బారిన పడ్డారు. అలాగే ఉమ్మడి జిల్లాలో 2023 సంవత్సరంలో 205 మంది, 2024 జూలై వరకు 40 మంది కోతికాటుకు గురయ్యారు.

ఎవరూ ఆదుకోలేదు



మే 30వ తేదీన ఇంటి వద్ద ఆడుకుంటున్న నా నాలుగు సంవత్సరాల బాబును కుక్కకాటు వేసింది. వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకుపోయాం. సర్జరీ చేస్తే రూ. లక్ష వరకు ఖర్చు వచ్చింది. మునిసిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు ఎలాంటి సాయం చేయలేదు. అప్పులు చేసి వైద్యం చేయించాను. ఎవరూ పరామర్శ కూడా చేయలేదు. జరిగిన దాడిని కూడా పట్టించుకోలేదు. ఇప్పటికైనా వీధికుక్కల నివారణ చర్యలు తీసుకోవాలి. అవి దాడి చేస్తే ప్రాణాలు పోయే పరిస్థితి ఉంది. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకూడదు.

- గంజి నరేష్, బాధితురాలి తండ్రి, కొల్లాపూర్

జంతు జనన నియంత్రణ కరువు..

ఉమ్మడి జిల్లాలోని ప్రధాన మునిసిపాలిటీల్లో జంతు జనన నియంత్రణ కేంద్రాలు ఏర్పాటు చేశారు. వనపర్తిలో ఏర్పాటు చేసిన కేంద్రం వినియోగంలోకి తేలేదు. ఇక్కడ జనవరిలో 1,600 కుక్కలను పట్టణంలో పట్టుకుని.. అడవిలో వదిలిపెట్టారు. అయినా కుక్కల బెడద తగ్గలేదు. కుక్కలను తరలించిన కారణంగా జంతు సంరక్షణ సభ్యులు ఫిర్యాదు చేయడంతో అధికారులపై కేసు నమోదైంది. మహబూబ్‌నగర్ మునిసిపాలిటీలో మౌలాలి గుట్టపై జంతు జనన నియంత్రణ కేంద్రం ఏర్పాటు చేశారు. స్వతంత్ర యానిమల్ కేర్ సెంటర్ అనే సంస్థ జనన నియంత్రణ ఆపరేషన్లు చేస్తోంది. ప్రతీ రోజు 10 కుక్కలకు చికిత్స చేస్తుండగా.. ఇప్పటి వరకు 5,100 కుక్కలకు ఆపరేషన్లు చేశారు. ఒక్కో కుక్క ఆపరేషన్ కోసం రూ.1,450 ఖర్చు చేస్తున్నారు. అయినా నియంత్రణ అనుకున్న స్థాయిలో జరగడం లేదు. ప్రతీ కౌన్సిల్ మీటింగ్‌లలో ప్రస్తావనకు రావడంతో పాటు కుక్కకాటుపై ఫిర్యాదులు పెరుగుతుండటంతో కలెక్టర్ ఈ నెల 24న కేంద్రాన్ని పరిశీలించారు. రోజుకు 50 కుక్కలకు ఆపరేషన్లు చేయాలని ఆదేశించారు. నారాయణపేటలో కూడా కుక్కల బెడద తీవ్రంగా ఉంది. ఇక్కడ ఇప్పటివరకు ఆపరేషన్లకు సంబంధించిన చర్యలు తీసుకోలేదు. ఇప్పుడు ప్రణాళిక సిద్ధం చేసి.. జనన నియంత్రణ ఆపరేషన్లు చేయనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. జడ్చర్ల మునిసిపాలిటీలో రెండు నెలల క్రితం 800 కుక్కలను అటవీ ప్రాంతంలో వదిలిపెట్టినప్పటికీ, బెడద తగ్గలేదు. స్టెరిలైజేషన్ కోసం కలెక్టర్‌కు నివేదిక అందజేశామని, ఆదేశాలు వచ్చిన వెంటనే ప్రక్రియ ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు. గద్వాల మునిసిపాలిటీలోనూ బెడద తీవ్రంగా ఉంది. గతంలో వీటిని నిర్బంధించి దూర ప్రాంతాల్లో వదిలారు. అప్పుడు జంతు సంరక్షణ సభ్యుల ఫిర్యాదు మేరకు కేంద్ర ప్రభుత్వం నుంచి కమిషనర్‌కు నోటీసు అందడంతో ప్రక్రియను నిలిపివేశారు. స్టెరిలైజేషన్ కోసం స్వచ్ఛంద సంస్థతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపిన అధికారులు.. ఒప్పందం జరిగిన వెంటనే జనన నియంత్రణ ఆపరేషన్లు చేస్తామని చెబుతున్నారు. నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీలో 700 వరకు వీధికుక్కలు ఉన్నట్లు గుర్తించారు. మూడు రోజుల్లో కౌన్సిల్ సమావేశంలో చర్చించి.. నియంత్రణకు చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు. మొత్తంగా ఎక్కడ కూడా పూర్తి స్థాయిలో నియంత్రణ చర్యలు తీసుకోవడం లేదు. పాలమూరు జిల్లా కేంద్రంలోనే చెప్పుకోదగ్గ నియంత్రణ చర్యలు ఉండగా.. మిగతా చోట్ల నిర్లక్ష్యమే కనిపిస్తోంది.



గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం బుడమొర్సులో కుక్కలదాడిలో గాయపడ్డ బాలుడు



వనపర్తి జిల్లా మియాపూర్‌లో కుక్కలదాడిలో చనిపోయిన 58 గొర్రెలు(ఫైల్)

ప్రాజెక్టు వద్ద భద్రత కట్టుదిట్టం చేయాలి

- ఎస్పీ రావుల గిరిధర్

అమరచింత, జూలై 29: ఎగువ నుంచి జూరాల ప్రాజెక్టుకు వరద ఉధృతి పెరిగే అవకాశం ఉన్నందున పోలీస్ పహారాతో పాటు భద్రత కట్టుదిట్టం చేయాలని ఎస్పీ రావుల గిరిధర్ ఆదేశించారు. సోమవారం రాత్రి ఆయన జూరాల ప్రాజెక్టును సందర్శించి అక్కడ సందర్శకుల రద్దీ ఉండే ప్రాంతం, నీటి ప్రవాహం, పుష్కర ఘాట్, ప్రధాన ఎడమ కాలువ, సమాంతర కాలువ, ప్రాజెక్టు ప్రధాన రహదారిని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎగువన కురుస్తున్న వర్షాలు నారాయణపూర్, ఆల్మట్టి ప్రాజెక్టుల నుంచి దిగువకు వదులుతున్న వరదను దృష్టిలో ఉంచుకొని ప్రాజెక్టుకు వేలాదిగా వస్తున్న సందర్శకులను కట్టడి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ముఖ్యంగా ప్రాజెక్టు బ్యాక్ వాటర్, ఎడమ కాలువ, పుష్కర ఘాట్ల వద్ద సందర్శకులు నీటిలో దిగకుండా పోలీస్ పహారాను పెంచాలని ఆదేశించారు. పార్కింగ్ ఇబ్బంది లేకుండా చూడాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీఐ శివకుమార్, ఎస్ఐ సురేష్, నరేందర్ తదితరులు ఉన్నారు.

తగ్గిన బంగారం ధరలు

- తులం పసిడి రూ.71,700.. కిలో వెండి రూ.86,000

నారాయణపేట, జూలై 29: బంగారం, వెండి ధరలు తగ్గుతున్నాయి. కేంద్రం బడ్జెట్‌లో కస్టమ్స్ సుంకం తగ్గించడంతో ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. రాబోయే శ్రావణమాసంలో శుభకార్యాలు, వివాహాలు ఉండటంతో ధరల తగ్గుదల ఊరట కలిగిస్తున్నాయి. సోమవారం తులం(పది గ్రాములు) బంగారం ధర రూ.71,700 ఉండగా.. కిలో వెండి రూ.86,000 ధర పలికింది. ముడు రోజుల క్రితం తులం బంగారం ధర రూ.73,500 ఉండగా, కిలో వెండి రూ.92,500 పలికింది. మూడు రోజుల్లో తులం బంగారం ధర రూ.1,800 తగ్గడం, కిలో వెండి ధర రూ.6,500 తగ్గడంతో కొనుగోలుదారులకు కాస్త ఊరట కలిగింది.



ప్రాజెక్టు మూడు గేట్ల నుంచి విడుదలవుతున్న నీరు

సందర్శకుల సందడి

దోమలపెంట, జూలై 29: శ్రీశైలం ప్రాజెక్టు మూడు గేట్లను అధికారులు సోమవారం ఎత్తారు. ఎగువ నుంచి వరద అధికంగా రావడంతో అనుకున్న గడువు కంటే ఒక రోజు ముందే గేట్లను ఎత్తినట్లు డ్యాం సీఈ కబీర్ బాషా తెలిపారు. గేట్లు ఎత్తిన విషయం తెలుసుకున్న పర్యాటకులు చూసేందుకు అధిక సంఖ్యలో వచ్చారు. కృష్ణమ్మ పరవళ్లను చూసి ఆనందం వ్యక్తం చేశారు. ఫొటోలు, సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు. పర్యాటకుల రాకతో డ్యాం సమీపంలో రోడ్డుపై వాహనాలు నిలిచిపోయి, ట్రాఫిక్ జాం ఏర్పడింది.



సెల్ఫీ దిగుతున్న పర్యాటకులు





శ్రీశైలం ఘాట్ రోడ్డుపై నిలిపిన వాహనాలతో ఏర్పడిన ట్రాఫిక్ జాం

మారనున్న.. కల్వకుర్తి దశ

- వంద పడకల ఆస్పత్రికి సీఎం పచ్చజెండా
- ఆర్‌అండ్‌బీ రోడ్ల అభివృద్ధికి రూ.180 కోట్లు
- ఐదు హైలెవల్ బ్రిడ్జిలకు రూ.15 కోట్లు
- పీఆర్, ఇతర రోడ్లకు మరిన్ని నిధులు
- తాను చదివిన తాండ్ర స్కూల్‌కు రూ.5 కోట్లు
- మాడ్గుల మండలంలో స్కూళ్ల అభివృద్ధికి రూ.10 కోట్లు
- ఆమనగల్‌లో రూ.10 కోట్లతో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్



సీఎం చదువుకున్న తాండ్ర ప్రభుత్వ పాఠశాల

కల్వకుర్తి, జూలై 29: రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆదివారం కల్వకుర్తి పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ మైదానంలో నిర్వహించిన బహిరంగ సభలో ప్రకటించిన వరాలతో ఈ ప్రాంతం దశ మారనుంది. ఆయన నడిచిన గడ్డపై మమకారం చూపిస్తూ కోట్ల రూపాయల నిధులను మంజూరు చేశారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి విన్నపాలకు సీఎం సానుకూలంగా స్పందించి, కల్వకుర్తి ప్రజల అభిమానాన్ని మూటగట్టుకున్నారు.



కల్వకుర్తిలో ఆదివారం నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతున్న సీఎం

ఆర్‌అండ్‌బీ రోడ్లకు రూ.180 కోట్లు

కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆర్‌అండ్‌బీ రోడ్లకు రూ.180 కోట్లు మంజూరు చేస్తున్నట్లు సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రకటించారు. దాంతో మెరుగైన రవాణా సౌకర్యం కలుగనుంది. కల్వకుర్తి నియోజకవర్గంలోని తండా (గ్రామ పంచాయతీలు)లు, పంచాయతీ రాజ్ రోడ్ల నిర్మాణానికి కావాల్సిన నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామ పంచాయతీల నుంచి మండల కేంద్రాలకు బీటీ రోడ్లు, ప్రతీ మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి డబుల్ రోడ్లు, జిల్లా కేంద్రం నుంచి హైదరాబాద్‌కు నాలుగు లేన్ల రోడ్లు నిర్మించేందుకు నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. కల్వకుర్తి నుంచి హైదరాబాద్ వరకు ఉన్న జాతీయ రహదారిని నాలుగు లేన్ల రోడ్డుగా అభివృద్ధి చేస్తామని, అందుకు కావాల్సిన నిధుల కోసం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి వినతి ఇవ్వడం జరిగిందన్నారు. త్వరలోనే కల్వకుర్తి-హైదరాబాద్ రోడ్డును నాలుగు లేన్లుగా అభివృద్ధి చేస్తామని సీఎం ప్రకటించారు. నియోజకవర్గంలో రూ.15 కోట్లతో ఐదు హైలెవల్ బ్రిడ్జిలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.

వంద పడకల ఆస్పత్రి..

కల్వకుర్తి పట్టణంలోని 50 పడకల సీహెచ్‌సీ ఆస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా మంజూరు చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు. ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులకు ప్రస్తుత సీహెచ్‌సీలో మెరుగైన వైద్యం అందించే అవకాశం లేదు. ప్రథమ చికిత్స చేసి, జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేస్తున్నారు. వంద పడకల ఆస్పత్రి నిర్మాణంతో ఈ ప్రాంత ప్రజలకు, ప్రమాదాల్లో గాయపడ్డ వారికి మెరుగైన వైద్య సేవలు అందనున్నాయి.

విద్యాభివృద్ధికి..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తాను చదువుకున్న కల్వకుర్తి మండలం తాండ్ర హైస్కూల్‌పై మమకారాన్ని చూపించారు. స్కూల్‌ను అభివృద్ధి చేసేందుకు రూ.ఐదు కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. దాంతో తాండ్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మోడల్ పాఠశాలగా రూపాంతరం చెందనుంది. అదేవిధంగా వెల్దండ మండలంలో పాఠశాలల అభివృద్ధికి మరో రూ.ఐదు కోట్లు మంజూరు చేశారు. కేంద్ర మాజీ మంత్రి సూదిని జైపాల్‌రెడ్డి స్వగ్రామం మాడ్గుల గ్రామంలో వంద శాతం అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి కావాల్సిన నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. మాడ్గుల మండలంలో స్కూళ్ల అభివృద్ధికి రూ.పది కోట్లు మంజూరు చేశారు. ఆమనగల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు, జూనియర్ కళాశాల భవనాలకు అవసరమైన నిధులు మంజూరు చేశారు.

నైపుణ్య శిక్షణ కోసం..

కల్వకుర్తి నియోకజవర్గంలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడానికి ఆమనగల్ ప్రాంతంలో రూ.10 కోట్లతో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను వెంటనే మంజూరు చేస్తున్నానని, పనులు ప్రారంభించాలని సీఎం ఆదేశించారు. దీంతో ఈ ప్రాంతంలోని నిరుద్యోగులకు ఉపాధి నైపుణ్య శిక్షణలు అందుబాటులోకి రానున్నాయి. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక మొదటిసారి కల్వకుర్తికి వచ్చి, వరాల జల్లు కురిపించడంతో రేవంత్ రెడ్డిపై నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

పనులు పూర్తి చేసి రుణం తీర్చుకుంటా



కల్వకుర్తికి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియోజకవర్గ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేలా అభివృద్ధికి నిధులు కేటాయించారు. దీనిని నేను అదృష్టంగా భావిస్తున్నా. ఉమ్మడి జిల్లాలో ఎమ్మెల్సీగా ఉన్న కాలంలో కూడా ఇన్ని అభివృద్ధి కార్యక్రమాలు మంజూరు చేయించుకునే అవకాశం దక్కలేదు. కేవలం మొదటిసారి కల్వకుర్తికి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి వంద పడకల ఆస్పత్రి, హైదరాబాద్ నుంచి కల్వకుర్తి వరకు నాలుగు లేన్ల రహదారి, మాడ్గులలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీతోపాటు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, తాండ్ర పాఠశాల అభివృద్ధికి రూ.ఐదు కోట్ల ప్రత్యేక నిధులు కేటాయించడం సంతోషదాయకం. తండాలు అధికంగా ఉన్న కల్వకుర్తి నియోజకవర్గంలో ప్రత్యేక గ్రాంటు ద్వారా రోడ్లను అభివృద్ధి చేయడానికి నిబద్ధతతో కూడిన ప్రకటన చేయడం ప్రజాప్రతినిధిగా నాకు సంతృప్తినిచ్చింది.

- కశిరెడ్డి నారాయణరెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే

తాండ్ర హైస్కూల్‌కు మహర్దశ



కల్వకుర్తి మండలం తాండ్ర గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మహర్దశ రానుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి తాను చదువుకున్న పాఠశాల అభివృద్ధికి రూ.5 కోట్లు మంజూరు చేయడం సంతోషదాయకం.

- కాయితీ ఆశాదీప్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు, తాండ్ర గ్రామం

నేడు రెండో విడత రుణమాఫీ

- కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్(కలెక్టరేట్), జూలై 29: పంట రుణమాఫీలో భాగంగా రెండో విడత మాఫీ కార్యక్రమాన్ని మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి శాసన సభ నుంచి ప్రారంభించ నున్నట్లు కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. సోమవారం ఆమె అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, ఎస్. మోహన్‌రావు తో కలిసి జిల్లా వ్యవసాయ శాఖ, సహకార అధికారులతో కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి వెబెక్స్ వెబెక్స్ ద్వారా సమావేశం అయ్యారు. రెండో విడత రుణమాఫీపై సమీక్షించి, సూచనలు చేశారు. రూ.1.50లక్షల లోపు రుణాలున్న రైతులకు రుణమాఫీ అవుతుందని తెలిపారు. కలెక్టరేట్‌లో, మండలాల్లో మధ్యాహ్నం 12 గంటలకు రెండో విడత రుణమాఫీ కార్యక్రమం ప్రారంభం అవుతుందని చెప్పారు. మండలాల నుంచి ఎంపిక చేసిన రైతులు కలెక్టరేట్‌కు హాజరయ్యేందుకు వ్యవసాయ శాఖ అధికారులు రవాణ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

250 కొత్త బస్సులకు కొత్త ప్రతిపాదనలు

మహబూబ్‌నగర్ టౌన్, జూలై 29: మహబూబ్‌నగర్ రీజియన్‌లోని పది డిపోల్లో 250 బస్సులకు ప్రతిపాదనలు పంపినట్లు ఆర్ఎం శ్రీదేవి తెలిపారు. సోమవారం మహబూబ్‌నగర్ రీజియన్ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆర్టీసీకి అధిక ఆదాయం వచ్చేందుకు మార్గాలను అన్వేషిస్తున్నామన్నారు. 125 కొత్త షాప్‌లకు టెండర్లు పిలుస్తున్నామని మహబూబ్‌నగర్‌లో 20 షాప్‌లకు టెండర్లు పిలువనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ప్రవేశపెట్టిన మహాలక్ష్మీ పథకాన్ని అమలు చేస్తున్నామని, ఇప్పటి వరకు ఈ పథకం కింద 2లక్షల 80వేల మంది మహిళా ప్రయాణికులు జీరో టికెటు మీద ప్రయాణం చేశారన్నారు. 1.60లక్షల మంది ప్రయాణికులు టికెట్ తీసుకొని ప్రయాణం చేశారని తెలిపారు. దాదాపు 63శాతం మహిళలు బస్సుల్లో ప్రయాణం చేస్తున్నారని, 40శాతం టికెటు ద్వారా ప్రయాణం కొనసాగిస్తున్నారని తెలిపారు. హైదరాబాద్ నాన్ స్టాప్ బస్సును జడ్చర్ల సింగిల్ స్టాఫ్ చేశామన్నారు.

లగ్జరీ బస్సులో ప్రయాణం చేసిన వారికి గిఫ్ట్ స్కీమ్ ప్రవేశ పెట్టామని, ప్రతీ నెల డ్రా ద్వారా 1,2,3 బహుమతులను ఎంపిక చేసి నగదు పురస్కారాలు ఇస్తున్నట్లు తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు ప్రోత్సాహకాలు ఇవ్వడం జరుగుతుందని అన్నారు.

శుభకార్యాలకు ఆర్టీసీ బస్సు సదుపాయం

శ్రావణ మాసంలో వచ్చే శుభకార్యాలయాలకు డిపాజిట్ లేకుండా బస్సులను బుక్ చేసుకోవాలని ఆర్ఎం వి.శ్రీదేవి కోరారు. మహబూబ్‌నగర్ రీజియన్ పరిధిలో పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, డీలక్స్, సూపర్ లగ్జరీ బస్సులు అద్దె ప్రతిపాదికన ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. గతంలో డిపాజిట్ తీసుకునే వారని ఇప్పుడు డిపాజిట్‌తో పాటు డ్రైవర్ బత్తా కూడా ఇవ్వనవసరం లేదని తెలిపారు. ఉమ్మడి జిల్లా ప్రజలు ఈ సదుపాయాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. చెప్పిన చోట నుంచి ఎక్కడికైనా, ఎన్ని గంటలైనా అద్దెకు తీసుకోవచ్చునని తెలిపారు. ఇతర వివరాలకు బస్సు బుక్ చేసుకునేందుకు అచ్చంపేట, గద్వాల, కల్వకుర్తి, కొల్లాపూర్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నారాయణపేట, షాద్‌నగర్, వనపర్తి డిపోల్లో సంబంధిత అధికారులను సంప్రదించాలని కోరారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఎం శ్రీదేవి

దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

ఊర్కొండ, జూలై 29: దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం... ఊర్కొండకు చెందిన ఆంజనేయులు అదే గ్రామానికి చెందిన తిరుపాల్ మటన్ షాపు వద్ద ఆదివారం రాత్రి ఘర్షణ పడ్డారు. ఘర్షణలో ఆంజనేయులుకు రక్త గాయం అయిందని అన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు తిరుపాల్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.

భారీగా నల్ల బెల్లం పట్టివేత

- 4500 కిలోల నల్ల బెల్లం, 250 కేజీల పటిక స్వాధీనం



స్వాధీనం చేసుకున్న వాహనం, పట్టుబడిన ఇద్దరు వ్యక్తులు

ఉప్పునుంతల, జూలై 29 : నాగర్‌కర్నూల్ జిల్లాలో రూ. 15లక్షల విలువైన నల్లబెల్లం, పటికను పట్టుకున్నట్లు తెల్కపల్లి ఎక్సైజ్ సీఐ రమణయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్ మెంట్ పోలీసుల సమాచారం మేరకు సోమవారం జిల్లాలోని ఉప్పునుంతల మండల పరిధిలోని దేవదారికుంటతండా వద్ద ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వాహనాలను తనిఖీ చేశారు. అదే సమయంలో అచ్చంపేట పట్టణానికి చెందిన సతీష్, మండల పరిధిలోని లింగోటంతండాకు చెందిన కాట్రవత్ ప్రేమ్ చంద్రు ఇద్దరూ కలిసి హైదరాబాద్ నుంచి అచ్చంపేటకు అశోక్‌లేలాండ్ వాహనంలో 150 బ్యాగులలో 30 కిలోల చొప్పున 4,500 కిలోల నల్లబెల్లం, 250 కిలోల పటికను తరలిస్తూ పట్టుబడ్డారు. వాహనంతో పాటు, బెల్లం, పటికను స్వాధీనం చేసుకున్నామని, వాటి విలువ రూ.15 లక్షలు ఉంటుందని సీఐ తెలిపారు. వీరిద్దరూ చాలా కాలంగా ఈ దందా చేస్తున్నట్లు ఆయన చెప్పారు. దాడులలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ శ్రీనివాస్, సీఐలు బాలకృష్ణారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, శారద, ఎస్ఐ సృజన్‌రావు పాల్గొన్నారు. వారిని ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ విజయ భాస్కర్‌రెడ్డి అభినందించారు.

పల్లెకు రాని వెలుగు

▸ మండలంలో కనుమరుగైన ఆర్టీసీ సేవలు ▸ ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్న ప్రజలు

▸ కాలినడకనే పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థులు

ఉండవల్లి, జూలై 29 : పల్లెవెలుగు బస్సులు పల్లెలకు రావడానికి మొఖం చాటేశాయి. ఉమ్మడి రాష్ట్రంలో ఉదయం ఐదు నుంచి రాత్రి పది గంటల వరకు ప్రతీ గంటకు కర్నూలు నుంచి ఉండవల్లి మీదుగా మారమునగాలకు ఆర్టీసీ సేవలు ప్రజల రవాణా కష్టాలకు ఎటువంటి అంతరాయం లేకుండా బస్సు సర్వీసులు ఉండేవి. స్వరాష్ట్రంలో రానురాను కర్నూలుకు బస్సు సర్వీసులు కనుమరుగయ్యాయి. అధికారులకు, ప్రజాప్రతినిధులకు గుర్తుకు వచ్చినప్పుడల్లా మినీ బస్సులను ఏర్పాటు చేస్తామని అనడం పరిపాటిగా మారిందని మండల ప్రజలు అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థుల అగచాట్లు.. జనాల ఇక్కట్లు

మండలంలో 15 గ్రామాలకు గాను బొంకూర్, భైరాపురం గ్రామాలకు మాత్రమే బస్సు సర్వీసులు నడుస్తున్నాయి. ఆ రెండు గ్రామాలు అలంపూర్, అయిజ రూట్‌లో ఉన్నందుకు వారికి వెసులుబాటు ఉంది. మిగతా గ్రామాలైన ఉండవల్లి, కంచుపాడు, తక్కశిల, ప్రాగటూర్, చిన్నఆముదాలపాడు, శేరుపల్లి, మారమునగాల-1, 2, పుల్లూరు, మెన్నిపాడు, కలుగొట్ల, ఇటిక్యాలపాడు గ్రామాల ప్రజలు ఆర్టీసీ సేవలకు నోచుకోవడం లేదు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు కాలిబాట పడుతున్నారు. చిన్న ఆముదాలపాడు, కంచుపాడు విద్యార్థులు ఉండవల్లి పాఠశాలకు, ప్రాగటూర్, మారమునగాల, శేరుపల్లి విద్యార్థులు తక్కశిల పాఠశాలకు ప్రతిరోజు ఐదారు కిలోమీటర్లు నడుస్తున్నారు. పుస్తకాల బ్యాగు బరువుతో ఇబ్బందులు పడుకుంటూ కనపడిన వారిని లిఫ్ట్ అడుగుతూ సంవత్సరాల తరబడి ఇదే తంతు కొనసాగుతోంది. ఇవే గ్రామాల నుంచి అలంపూర్ చౌరస్తాకు ఇంటర్, డిగ్రీ చదవడానికి వెళ్లే విద్యార్థులు వందల సంఖ్యలో ఉన్నారు. వీరంతా అష్టకష్టాలు పడుతూ చదువుకోవడానికి ప్రైవేటు వాహనాల్లో వెళ్తున్నారు. బస్సులు లేక రవాణ సౌకర్యాలు ఆశించినంతగా లేకపోవడంతో అమ్మాయిలను పాఠశాలలకు పంపడానికి తల్లిదండ్రులు సంశయం వ్యక్తం చేస్తున్నారు.

ప్రైవేట్ వాహనాలే దిక్కు..

అలంపూర్ చౌరస్తాలో మినీ ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేసి ప్రజల రవాణ కష్టాలు తీర్చుతామని గతంలో ఎమ్మెల్యేలు హామీలు ఇచ్చారు. ఎమ్మెల్యేలు మారుతున్నారు, అధికారులు మారుతున్నారు గానీ బస్సు డిపో ఏర్పాటు నియోజకవర్గ ప్రజలకు ఎండమావిలాగే మిగిలిపోయింది. గతంలో కొన్ని సందర్భాలు పాఠశాలల వేళకు తగిన సమయంలో ఉదయం, సాయంత్రం అలంపూర్ చౌరస్తా నుంచి మానమునగాల వరకు బస్సు సర్వీసులు ఉండేవి. ప్రయాణికులు ఎక్కడం లేదనే సాకుతో సర్వీసులను రద్దు చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ పనుల నిమిత్తం ప్రజలు వస్తూ పోతుంటారు. బస్సు సౌకర్యాలు లేకపోవడంతో ఆటోలను ఆశ్రయిస్తున్నారు. ఒకవైపు ప్రైవేటు వాహనాల్లో ప్రయాణాలు వద్దు.. ఆర్టీసీ సేవలు ముద్దు అంటూ ప్రభుత్వం విస్తృతంగా ప్రచారం చేస్తున్నా అందుకు తగిన బస్సులు లేకపోవడంతో ప్రైవేటు వాహనాలను ఆశ్రయించక తప్పడం లేదు. ఇదే అదనుగా అదనపు చార్జీలు చెల్లించి తమ ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు కనీసం విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని రవాణా సేవలను పునరుద్ధరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



ఉండవల్లి నుంచి చిన్న ఆముదాలపాడుకు కాలినడకన వెళ్తున్న విద్యార్థులు



ఆటోల కోసం వేచి ఉన్న విద్యార్థులు

చాలా ఇబ్బందులు పడుతున్నా..



నేను ఆరవ తరగతి నుంచి ఉండవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్నాను. ఒకరోజు, ఒకనెల కాదు ఐదు సంవత్సరాలుగా చాలా ఇబ్బందులు పడుకుంటూ పాఠశాలకు వస్తున్నాను. ఉదయం ఆరు నుంచి గంటల తరబడి వేచి ఉంటే ఆటో పూర్తిగా ప్రయాణికులు ఎక్కేంత వరకు కదలదు. పాఠశాల రావడానికి ఆలస్యం అవుతుందనే బాధ చాలా సందర్భాల్లో వేధించింది. అలంపూర్ చౌరస్తా నుంచి మారమునగాల వరకు పాఠశాల వేళలో సరైన బస్సులను నడిపితే మాలాంటి విద్యార్థులకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది.

\- శ్రావణి, పదవ తరగతి, మారమునగాల

అలంపూర్ చౌరస్తాలో మినీ డిపో ఏర్పాటు చేయాలి..



అలంపూర్ చౌరస్తాలో మినీ ఆర్టీసీ డిపో ఏర్పాటు చేస్తే ఉండవల్లితో పాటు అలంపూర్, మానవపాడు, ఇటిక్యాల, వడ్డేపల్లి, రాజోలి మండలాల ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయి. విద్యార్థులకు, వ్యాపారులకు, ఉద్యోగుల రాకపోకలకు మేలు జరుగుతుంది. మహాలక్ష్మి పథకం కూడా ఈ మండల మహిళలు సద్వినియోగం చేసుకుంటారు.

\- హేమంత్‌కుమార్, ప్రాగటూర్ గ్రామస్థుడు

నాలుగు యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి

▸ జూరాలకు కొనసాగుతున్న వరద

▸ 43 గేట్ల ద్వారా నీటి విడుదల

ధరూరు, జూలై 29 : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టులో నాలుగు యూనిట్ల ద్వారా 140 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది. ఎగువ ఆల్మట్టి, నారాయణపూర్ జలశయాల్లో ప్రాజెక్టులు నిండుగా ఉండటంతో జూరాలకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో 43 గేట్ల ద్వారా 3,11,000 క్యూసెక్కుల నీటిని నీటిని దిగువున ఉన్న శ్రీశైలం జలాశయానికి అధికారులు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జూరాల జలాశయంలో 317.640 మీటర్లలో నీటి నిల్వ ఉండగా, ప్రాజెక్టులో 7.914 టీఎంసీలకు నీటి నిల్వ చేరుకుంది. ప్రాజెక్టులో 3,15,000 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా నమోదు కాగా, 43 గేట్లను ఒక మీటరు మేర ఎత్తివేసి 2,83,351 క్యూసెక్కుల నీటిని దిగువన శ్రీశైలం జలాశయానికి, విద్యుత్ ఉత్పాదన కోసం జెన్‌కో జల విద్యుత్ కేంద్రానికి 18,436 క్యూసెక్కుల నీటిని విడుదల చేసున్నారు. నెట్టెంపాడు లిఫ్ట్‌కు 750 క్యూసెక్కులు, భీమా లిఫ్ట్-1కు 1300, కోయిల్‌సాగర్ లిఫ్ట్‌కు 315, ఎడమ కాల్వకు 820, కుడి కాలువకు 658, సమాంతర కాల్వకు 900, భీమా లిఫ్ట్-2కు 750 క్యూసెక్కులతో మొత్తం ప్రాజెక్టు నుంచి 3,11,575 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు జూరాల అధికారులు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

సుంకేసుల డ్యాంకు కొనసాగుతున్న వరద

▸ ఎగువ నుంచి 1.52 లక్షలు ఇన్‌ఫ్లో, దిగువకు 1.50లక్షల క్యూసెక్కులు



సుంకేసుల డ్యాం నుంచి శ్రీశైలం డ్యాంకు పరవళ్లు తొక్కుతున్న వరద

రాజోలి, జూలై 29 : మండల కేంద్రమైన రాజోలి శివారులోని సుంకేసుల జలాశయానికి వరద నీటి ఉధృతి కొనసాగుతూనే ఉంది. సోమవారం సుంకేసుల జలాశయానికి ఎగువ నుంచి 1.52 లక్షల క్యూసెక్కులు వరద నీరు వస్తుండటంతో జలాశయం నుంచి 28 గేట్ల ద్వారా 1.50 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు సుంకేసుల జలాశయం జేఈ రాజు తెలిపారు. సుంకేసుల డ్యాం నీటి సామర్థ్యం 292.00 కాగా, ప్రస్తుతం 289.60 మీటర్లుగా నమోదైంది. నీటి నిల్వ 1.20 టీఎంసీలు కాగా ప్రస్తుతం 0.461 టీఎంసీల నీరు ఉందని, కర్నూలు కేసీ కెనాల్‌కు 1500 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

▸ ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్.మూర్తి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూలై 29 : విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, రీయింబర్స్‌మెంట్ రూ.ఎనిమిది వేల కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్.మూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన విద్యా విజ్ఞాన శిక్షణ తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 2029 నుంచి 2024 వరకు దాదాపు ఆరేళ్ల నుంచి రావల్సిన స్కాలర్‌షిప్, రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. జిల్లా కార్యదర్శి ప్రశాంత్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు భరత్, నాయకులు నందు, ఈశ్వర్, రాధిక, శ్రీనాథ్, సాయి, మధు, బన్నీ తదితరులున్నారు.

వచ్చేనెల ఐదో తేదీలోగా

దరఖాస్తు చేసుకోవాలి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూలై 29 : జిల్లాలోని అన్ని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, ఎయిడెడ్ పాఠశాలల్లో పని చేస్తున్న హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, గురుకులల్లో పనిచేస్తున్న పీజీటీలు, టీజీటీలు, డైట్ అధ్యాపకులు రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఆగస్టు 5 లోగా దరఖాస్తు చేసుకోవాలని డీఈవో రవీందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారికి 2024 సెప్టెంబరులో 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయులు ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలతో పర్యవేక్షణ అధికారుల ద్వారా డీఈవో కార్యాలయానికి పంపించాలన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

నవాబ్‌పేట, జూలై 29 : పంటకు కాపలాకు వెళ్లిన ఓ వ్యక్తి మృతి చెందడంతో అతడి మరణంపై అనుమానం ఉందంటూ కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటన మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలంలోని రుద్రారం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్థుల, ఎస్ఐ విక్రం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సంకెళ్ల మాసయ్య(50) కొద్ది కాలంగా మూర్ఛవ్యాధితో బాధపడేవాడు. ఇటీవల ఇంజక్షన్లు సైతం తీసుకున్నాడు. అయితే అతడు ఆదివారం రాత్రి గ్రామ సమీపంలో ఉన్న తన సొంత పొలంలో మొక్కజొన్న పంటకు కావలిగా వెళ్లాడు. మాసయ్య పడుకున్న చోటే మృతి చెందాడు. సోమవారం ఉదయం గ్రామస్థులు గమనించి ఆయన కుమారుడు లింగంకు సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యులు ఘటన స్థలానికి వెళ్లి చూడగా ఆయన కణతకు గాయాలు, చెవి, ముక్కు నుంచి రక్తం రావడంతో మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

కేటీదొడ్డి, జూలై 29 : కాలువ విషయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగిన సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలంలోని పాతపాలెం గ్రామ శివారులో చోటు చేసుకుంది. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం పాతపాలెం గ్రామ శివారులో ఉన్న వ్యవసాయ పొలం వద్ద కాలువ విషయంలో వెంకట్రాములు, సాయప్ప ఇద్దరు రైతుల కుటుంబాల మధ్య ఘర్షణ జరిగింది. ఇరువర్గాలు పరస్పరం దాడులు చేసుకోవడంతో ఏడుగురికి గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండడంతో రాజు, కర్ణలను కర్నూలులోని ఆసుపత్రికి తరలించారు. నరేష్, నాగేంద్ర, నాగరాజు, సాయప్ప, నవీన్‌లు గద్వాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇరువర్గాలు ధరూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకోగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అబ్దుల్‌సుకూర్ తెలిపారు.

కుక్క కాటుతో బాలుడికి గాయం

మిడ్జిల్, జూలై 29: మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలంలోని చిలువేరు గ్రామానికి చెందిన శివుడు, నాగమణి దంపతుల కుమారుడు ప్రణయ్‌ని సోమవారం కుక్క కరిచినట్లు గ్రామస్థులు తెలిపారు. బాలుడి తల్లిదండ్రులు వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్లగా ఇంటివద్ద ఆడుకుంటున్న బాబును కుక్క కరిచింది. వెంటనే మిడ్జిల్ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. గ్రామాల్లో కుక్కలు విపరీతంగా పెరిగాయని చిన్నారులను ఇంటివద్ద ఉంచి వెళ్లాలంటే భయమేస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. కుక్కలు కాటు వేయకుండా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

చెరువులో మునిగి

రెండు కాడెద్దులు మృతి

నర్వ, జూలై 29 : ప్రమాదవశాత్తు చెరువులో మునిగి రెండు కాడెద్దులు మృతి చెందాయి. ఈ సంఘటన నారాయణపేట జిల్లా నర్వ మండలం లంకాల గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన సంజీవరెడ్డి ఎద్దుల బండితో సహా గ్రామంలోని చెరువు వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో ఎద్దుల దాహం తీర్చేందుకు చెరువు వద్దకు వెళ్లగా అక్కడ లోతైన గుంత ఉండటాన్ని గమనించలేక పోయాడు. రైతు కళ్ల ముందే రెండు కాడెద్దులు నీటి గుంతలో పడి మృతి చెందడంతో బోరున విలపించాడు. రైతు సైతం నీటిలో మునిగి బతికి బయట పట్టాడు. ఎద్దుల విలువ రూ.1.60 లక్షలు ఉంటాయని, ప్రభుత్వపరంగా ఆదుకోవాలని కోరారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చెన్నయ్య సాగర్ వెంటనే బాధితుడికి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు.

లట్టుపల్లి పీహెచ్‌సీకి తాళం

▸ వైద్యం కోసం వచ్చిన ఆందోళనతో రోగులు తిరుగు ముఖం

▸ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వైద్య సిబ్బంది

▸ సీజనల్ వ్యాధులతో నిత్యం ఆసుపత్రికి రోగుల రాక

▸ పేద ప్రజల ఆరోగ్య సేవల్లో కొరవడిన చిత్తశుద్ధి

బిజినేపల్లి, జూలై 29 : నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని లట్టుపల్లి గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)కు వివిధ ఆరోగ్య సమస్యలతో సోమవారం వెళ్లిన రోగులకు ఆసుపత్రికి తాళం వేసి ఉండటంతో ఆందోళనతో ఏమి చేయలేక కొందరు బిజినేపల్లికి పరుగు పెట్టారు.. మరికొందరు మూలుగుకుంటూ ఇంటికి తిరుగు ముఖం పట్టారు. అసలే వానాకాలం.. సీజనల్ వ్యాధులు, అంటు వ్యాధులు ప్రబలి వైద్యం కోసం నిరుపేదలు ప్రభుత్వ ఆసుపత్రులకు వస్తుంటారు. గిరిజన తండాల్లో ఉండే ప్రజలంటే చిన్నచూపో లేక వారికి ఏమైనా ఎవరు అడుగుతారులే అనే ధీమానో కానీ సోమవారం వైద్య సిబ్బంది పీహెచ్‌సీకి తాళం వేశారు.

పెద్ద వేములతండాకు చెందిన శారద అనే గిరిజన మహిళకు ఇంట్లోని పెంపుడు కుక్క కరవడంతో చికిత్స కోసం లట్టుపల్లి పీహెచ్‌సీకి వచ్చింది. ఆసుపత్రికి తాళం ఉండటంతో నేరుగా డీఎంహెచ్‌వో సుధాకర్‌లాల్‌కు ఫోన్ చేసి విషయం చెప్పింది. ఆసుపత్రికి తాళం వేయడం ఏమిటని విస్మయం వ్యక్తం చేసిన ఆయన వైద్య సిబ్బందిని పది నిమిషాల్లో పంపుతానని చెప్పినట్లు బాధితురాలు వాపోయింది. అలాగే నక్కలచెరువు తండాకు చెందిన రాజు నాయక్ అనే యువకుడిపై ఊర కుక్క దాడి చేసి తీవ్రంగా గాయపర్చడంతో తండ్రితో కలిసి పక్కనే ఉన్న పీహెచ్‌సీకి వచ్చాడు. ఆసుపత్రికి తాళం వేసి ఉండటంతో ఆసుపత్రి ఎందుకు కట్టారో అని తిట్టుకుంటూ బిజినేపల్లికి వెళ్లిపోయినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే చుట్టు ముట్టూ ఉన్న తండాల్లోని వివిధ రోగాలతో వచ్చిన వారు కొంత సమయం చూసి ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లిపోయినట్లు స్థానికులు తెలిపారు. వందల కోట్ల రూపాయలు ప్రభుత్వం కేటాయించి పేదలకు సకాలంలో వైద్య సేవలు అందించాలని గ్రామీణ ప్రాంతాల్లో ఆసుపత్రులు నిర్మించి లక్షల జీతాలు చెల్లించి సిబ్బందిని నియమిస్తే డ్యూటీలకు రాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరమని పలువురు విమర్శించడం గమనార్హం. ఇప్పటికైనా వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వీడి గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించి ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం కల్గించాలని కోరుతున్నారు.



కుక్క కరిచి తీవ్రంగా గాయపడి ఆసుపత్రికి వచ్చిన రాజునాయక్



తాళం వేసి ఉన్న లట్టుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

పెద్దపులుల సంరక్షణలో

దాతల భాగస్వామ్యం అభినందనీయం

▸ అంతర్జాతీయ పులుల దినోత్సవంలో డీఎఫ్‌వో రోహిత్ గోపిడి

మన్ననూర్, జూలై 29 : పెద్దపులుల సంరక్షణలో దాతల భాగస్వామయ్యం అభినందనీయమని డీఎఫ్‌వో రోహిత్ గోపిడి అన్నారు. ప్రపంచ పులుల దినోత్సవాన్ని పురస్కరించుకొని అమ్రాబాద్ మండలంలోని మన్ననూరు పర్యావరణ విజ్ఞాన కేంద్రం ఆవరణలో అడవుల సంరక్షణ, పెద్దపులుల రక్షణ కోసం సామాజిక సేవ అందిస్తున్న దాతలను సోమవారం సన్మానించారు. హైటికోస్, ఐసీఐసీఐ ఫౌండేషన్, అపోలో టోటల్ హెల్త్, నిర్మాణ్ ఆర్గనైజేషన్, రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్, దిప్రోస్పెరిటీ హోమ్స్ ప్రైవేట్ లిమిటెడ్, ది సిచెకో సస్టెనబిలిటీ, ఎలిమా, యునైటెడ్ వే, భూమిక ఉమెన్స్ కలెక్టివ్ సంస్థలు అమ్రాబాద్ అభయారణ్యంలో ఎనలేని సేవలు అందిస్తున్నాయని డీఎఫ్‌వో కొనియాడారు. కెమెరా ట్రాప్‌లు, ఫ్రంట్‌లైన్ సిబ్బందికి ప్రాథమిక సౌకర్యాల ఏర్పాటు, గ్రామాల తరలింపుతో పాటుగా ఇతర అటవీ సంరక్షణ చర్యల్లో సంస్థలు అందిస్తున్న సేవలను ప్రదర్శించారు. అనంతరం మన్ననూరులోని బాలుర హాస్టల్ విద్యార్థులతో అటవీ ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. విద్యార్థులను స్థానిక ప్రతాపరుద్ర కోటకు ట్రెక్కింగ్ తీసుకెళ్లి నెచురల్ గైడ్స్ ఆధ్వర్యంలో పక్షుల వీక్షణ సెషన్‌ను నిర్వహించారు. హైదరాబాద్‌లోని నసీర్ బాలుర పాఠశాల విద్యార్థులు మన్ననూరు పర్యావరణ విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించారు. విద్యార్థులకు అమ్రాబాద్ రిజర్వులోని వన్యప్రాణుల సంచారం, అడవులపై డిజిటల్ తెరపై సినిమా ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. శిక్షణ ఐఎఫ్ఎస్ సుశాంత్ బోబడే, రేంజ్ అధికారులు ఈశ్వర్, గురుప్రసాద్, ఆదిత్య, సెక్షన్ అధికారులు రవికుమార్, రామాంజనేయులు, బయాలజిస్టు మహేందర్, టైగర్ ఎన్జీవో బాపురెడ్డి, బీట్ అధికారులు రమేష్, మధు, బాబలి పాల్గొన్నారు.



భాగస్వామ్యులైన దాతల అభినందన సమావేశంలో మాట్లాడుతున్న డీఎఫ్‌వో రోహిత్ గోపిడి

చారిత్రక హైస్కూల్ అభివృద్ధికి కృషి

▸ ఎంబీ హైస్కూల్స్ బోర్డు చైర్మన్ మార్గరేట్ అనురాధ

గద్వాల టౌన్, జూలై 29 : పట్టణంలో చారిత్రక పాఠశాలగా గుర్తింపు పొందిన ఎంబీ హైస్కూల్‌ను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎంబీ హైస్కూల్స్ బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్ చైర్మన్ వీబీ మార్గరేట్ అనురాధ అన్నారు. పాఠశాల ప్రారంభమైన నాటి నుంచి వేలాది మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చి దిద్దిన ఎంబీ హైస్కూల్‌కు పూర్వపు వైభవాన్ని తీసుకువచ్చేందుకు బోర్డు తగిన చర్యలు తీసుకుంటుందన్నారు. పట్టణంలోని ఎంబీ హైస్కూల్‌లో సోమవారం నిర్వహించిన ప్లాటినం జూబ్లీ ఉత్సవాలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యాబోధనతో పాటు, విద్యార్థుల్లో నైతిక విలువలను పెంపొందించేందుకు తమ సంస్థ తొలి ప్రాధాన్యతనిస్తుందన్నారు. హెడ్‌మాస్టర్ కే.ప్రకాష్ మాట్లాడుతూ 1947లో పట్టణ సమీపంలోని కొత్తపల్లి మార్గంలో గల దొరవారి బంగ్లాలో ప్రారంభమైన పాఠశాల 1965లో పట్టణంలోని కృష్ణారెడ్డి బంగ్లాలోకి మార్చబడిందన్నారు. అంచెలంచెలుగా ఎదుగుతూ వేలాదిమంది విద్యార్థులను తీర్చిదిద్దడంతో పాటు వారి పురోగతిలో ఎంబీ హైస్కూల్ కీలకంగా మారిందన్నారు. ఉత్సవాలకు 1978-79 నుంచి మొదలైన ఎస్ఎస్‌సీ బ్యాచ్ మొదలుకుని దాదాపు 600 మందికి పైగా పూర్వపు విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల పూర్వపు హెడ్‌మాస్టర్లు బి.రాములు, ఎం.జోసెఫ్, ఉపాధ్యాయులు వరప్రసాద్, శ్యామ్యూల్, ఐజయ్య, రిటైర్ట్ ఎంఈవో డేవిడ్‌లను ఘనంగా సన్మానించారు. దశాబ్దాల అనంతరం కలుసుకున్న పూర్వపు విద్యార్థులు, ఉపాధ్యాయులు పరస్పరం యోగక్షేమాలు తెలుసుకుంటూ ఉల్లాసంగా గడిపారు.



పూర్వ హెడ్మాస్టర్లు, ఉపాధ్యాయులను సన్మానిస్తున్న హెడ్‌మాస్టర్, సిబ్బంది

తాళం వేసిన ఇంట్లో చోరీ



దొంగలు పగులగొట్టిన బీరువా తలుపులు, చిందరవందరగా పడేసిన దుస్తులు

జడ్చర్ల, జూలై 29 : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మునిసిపాలిటీలోని అయోధ్యనగర్ కాలనీలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం రంగాపురం గ్రామంలో బంధువుల ఇంట్లో బోనాల పండుగకు ఇంటికి తాళం వేసి ప్రవీణ్‌రెడ్డి తన కుటుంబసభ్యులతో కలిసి వెళ్లారు. జడ్చర్ల మండలం పోలేపల్లి సెజ్‌లోని ఓ ఫార్మ కంపెనీలో పనిచేస్తున్న ప్రవీణ్‌రెడ్డి తిరిగి సోమవారం ఇంటికి వచ్చాడు. ఇంటికి వేసిన తాళం విరగ్గొట్టి ఉండడం, ఇంట్లో చూడగా వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉండడంతో చోరీ జరిగిందని గుర్తించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు క్లూస్ టీంతో ఆధారాల కోసం విచారణ చేపట్టారు. కాగా, ఇంట్లో దాచి ఉంచిన ఐదు తులాల బంగారు, 30తులాల వెండి వస్తువులతో పాటు రూ.20వేల నగదు చోరీ అయ్యిందని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభిస్తున్నట్లు జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి తెలిపారు.

తల్లిదండ్రులకు యువకుడి అప్పగింత



యువకుడిని వారి తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

కేటీదొడ్డి, జూలై 29 : తల్లిదండ్రులు మందలించారని ఇంటి నుంచి వెళ్లిపోయిన యువకుడిని వెతికి పట్టుకుని వారి తల్లిదండ్రులకు పోలీసులు అప్పగించిన సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలం మల్లాపురం తండాలో చోటుచేసుకుంది. ఎస్సై శ్రీనివాస్‌రావు తెలిపిన వివరాల ప్రకారం... మల్లాపురం తండాకు చెందిన విజయ్ చెడు వ్యసనాలకు అలవాటు పడినందుకు తల్లిదండ్రులు మందలించారు. దీంతో ఆదివారం మధ్య రాత్రి ఆత్మహత్య చేసుకుంటానని ఆ యువకుడు ఇంటి నుంచి వెళ్లిపోయాడు. వెంటనే తల్లిదండ్రులు 100కు డయల్ చేయగా హెడ్‌కానిస్టేబుల్ రంజిత్‌కుమార్, హోంగార్డ్ శ్రీనివాసులు ఆ యువకుడిని వెతికి పట్టుకుని సోమవారం తల్లిదండ్రులు గంగానాయక్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా పోలీసులకు ఆ యువకుడి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

తుంగభద్ర ఎక్స్‌ప్రెస్‌పై రాళ్లు రువ్విన ఆకతాయిలు

▸ ఆన్‌లైన్ ఫిర్యాదుతో ఆర్పీఎఫ్ పోలీసుల విచారణ

▸ పోతులపాడు శివారులో ఘటన

▸ ఆ రెండు గ్రామాల్లో కౌన్సెలింగ్

అలంపూర్ చౌరస్తా, జూలై 29 : వేగంగా వెళ్తున్న ఓ ట్రైన్‌పై రాళ్లు రువ్విన ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలం పోతులపాడు గ్రామ శివారులో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మండల పరిధిలోని పెద్దపోతులపాడు గ్రామ శివారు గుండా సోమవారం మధ్యాహ్నం కర్నూలు నగరంలో తుంగభద్ర ఎక్స్‌ప్రెస్ రైలు హైదరాబాద్ వైపు బయలుదేరింది. కర్నూలు నుంచి సుమారు 20 కి.మీ. దూరంలో పెద్దపోతులపాడు, ఉండవల్లి మండలం, ఖనాపూర్ గ్రామ శివార్లలో వేగంగా వెళ్తున్న ఈ రైలుపై కొంతమంది ఆకతాయిలు వరుసపెట్టి రాళ్లు రువ్వారు. రైలులో ప్రయాణికులకెవరికి గాయాలు కాకపోయినా కిటికీల అద్దాలు పగిలిపోయాయి. కిటికీల వద్ద కూర్చున్న ప్రయాణికులు భయంభ్రాంతులకు గురయ్యారు. కొంతమంది ప్రయాణికులు ఆన్‌లైన్‌లో రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న కర్నూలు రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాంమోహన్ ఆదేశాల మేరకు సోమవారం సాయంత్రం ఏఎస్సై రమేష్‌రెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ వెంకటొరెడ్డిలు ఉండవల్లి మండలంలోని రైల్వేట్రాక్ వెంట ఉన్న పలు గ్రామాలతో పాటు, మానవపాడు మండలంలోని చిన్నపోతులపాడు, పెద్దపోతులపాడు గ్రామస్థులను విచారించారు. రైల్వే ఆస్తులను కాపాడాలని, ప్రభుత్వ ఆస్తుల పట్ల బాధ్యతాయుతంగా ఉండాలని అవగాహన కల్పించారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరిగితే బాధ్యులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ప్రస్తుత ఘటనతో ఎలాంటి ఆస్తి నష్టం జరగలేదని, భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా తీసుకునే చర్యల్లో భాగంగానే పలు గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నామని కర్నూలు రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాంమోహన్ 'ఆంధ్రజ్యోతి'తో ఫోన్‌లో తెలిపారు.

వినూత్న ఆవిష్కరణలపై దృష్టి సారించాలి

- వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



నూతన వస్త్రాన్ని ఎమ్మెల్యేకు అందిస్తున్న యువకులు

వనపర్తి టౌన్, జూలై 29: ఉన్నత చదువులు అభ్యసించి ప్రయోగాత్మక ఆలోచనలు కలిగిన యువకులు నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. పంటలకు, చీడపీడల నివారణ కోసం రసాయనాలను పిచికారి చేసే సమయంలో రైతుల శరీర రక్షణ కోసం వేముల ప్రవీణ్, ఓంప్రకాష్‌లు వినూత్నంగా తయారు చేసిన ప్రత్యేక వస్త్రాం గురించి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డిని హైదరాబాద్‌లోని తన నివాసంలో సోమవారం కలిసి వివరించారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రైవేటు కంపెనీ తరఫున ఒక ప్రత్యేక వస్త్రాన్ని తయారు చేస్తున్న యువకుల కృషి ఎంతో గొప్పదన్నారు. ప్రజలకు ఉపయోగపడే వినూత్న ఆవిష్కరణపై యువత దృష్టి సారించాలన్నారు. వ్యవసాయ రంగాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్న వారికి తన సహకారం ఎప్పుడు ఉంటుందని భరోసా ఇచ్చారు.

ఉత్సాహంగా గోరింటాకు వేడుక


చేతులకు పెట్టిన గోరింటాకు చూపుతున్న మహిళలు

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, జూలై 29: జిల్లా కేంద్రంలోని అయ్యప్ప ఆలయ ఆవరణలో సోమవారం మహిళలు గోరింటాకు వేడుకను ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బాలికలు, మహిళలు తమ చేతులకు గోరింటాకు పెట్టుకుని సంతోషాన్ని పంచుకున్నారు. జిల్లా పద్మశాలి సంఘం మహిళా అధ్యక్షురాలు చెన్న పద్మ మాట్లాడుతూ.. ఆషాఢ మాసంలో సహజ సిద్ధంగా దొరికే ప్రకృతి వరదాయని గోరింటాకు పెట్టుకుంటే మహిళలకు ఆరోగ్యం, సౌభాగ్యం, కలుగుతాయన్నారు. గోరింటాకులో ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ నందిమల్ల శారద, గంజి రత్నమ్మ, కంచె భాగ్యమ్మ, తిరుమల సక్కుబాయి, సారంగ శిరీష, వరకాల లక్ష్మి, చెన్న సరిత ఉన్నారు.

జూరాల కాలువలో పడిన గేదెలు

- రక్షించిన యువకులు


గేదెలను తాళ్ల సహాయంతో బయటకు లాగుతున్న యువకులు

కొత్తకోట, జూలై 29 : జూరాల కాలువ నీటిలో పాడి గేదెలు పడిన సంఘటన సోమవారం కొత్తకోట మండంలో చోటు చేసుకున్నది. మండలంలోని రామకృష్ణాపూర్ గ్రామానికి చెందిన గొల్లబుచ్చన్న తన రెండు పాడి గేదెలను గ్రామ సమీపంలోని జూరాల కాలువ కట్ట వద్ద మేతకు తీసుకెళ్లాడు. మేత మేస్తున్న గేదెలు నీళ్ల తాగేందుకు జూరాల కాలువ వద్దకు వెళ్లాయి. కాలువలోకి దిగుతూ కాలు జారి కాలువలో పడ్డాయి. గమనించిన బుచ్చన్న సెల్‌ఫోన్ ద్వారా ఇంటికి సమాచారం ఇచ్చి గేదెలను రక్షించడానికి కాలువలోకి దిగాడు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో కొట్టుక పోయాయి. గ్రామం నుంచి యువకులు వచ్చి కాలువ వెంట వెతికారు. కాలువలో కొట్టుకు పోతున్న గేదెలను, బుచ్చన్నను పామాపురం గ్రామ శివారులో గుర్తించారు. వెంట తెచ్చుకున్న తాళ్లతో యువకులు కాలువలోకి దిగి గేదెలకు కట్టి ఒకదాని తర్వాత మరోక గేదెను బయటకు లాగారు. గేదెలను రక్షించిన వారిలో భరత్ యాదవ్, నరేష్, మొగులయ్య, చంద్రశేఖర్, తిరుపతయ్య, భరతసింహ ఉన్నారు.

చెరకు రైతులకు మద్దతు ధర ఇవ్వాలి

- కృష్ణవేణి చెరకు రైతు సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాజన్న

అమరచింత, జూలై 29: కృష్ణవేణి చక్కెర పరిశ్రమ పరిధిలోని చెరకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి టన్నుకు వెయ్యి రూపాయల బోనస్ ఇవ్వాలని కృష్ణవేణి చెరకు రైతు సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కె.రాజన్న డిమాండ్ చేశారు. సోమవారం అమరచింతలో ఆ సంఘం నాయకులతో కలిసి మాట్లాడుతూ.. 13 సంవత్సరాలుగా ఈ పరిశ్రమ కింద చెరకు రైతులు పంటను సాగు చేస్తున్నారని ఆయన గుర్తు చేశారు. మొదట యజమాన్యం సబ్సిడీలు, లోన్లు ఇచ్చి కోతల కూలీల ధరలను అదుపులో ఉండడం వల్ల రైతులు లాభాల్లో ఉండేవారని అన్నారు. ప్రస్తుతం రికవరీ ధరతో పాటు భూమి కౌలు, ఎరువులు, మందులు, కోత కూలీల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మద్దతు ధర లేనందున పంట విస్తీర్ణం తగ్గుతూ వస్తుందని ఆయన అన్నారు. చెరకు రైతుల సమస్యలను మంగళవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి విన్నవించనున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, మహేంద్రచారి, రాజన్న, వెంకట్‌రెడ్డి, తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బుద్ధారం చెరువును పరిశీలించిన నాయకులు

పెద్దమందడి, జూలై 29: పెద్దమందడి, ఘణపూర్ మండలాలకు సాగునీరు అందించే బుద్ధారం చెరువును వనపర్తి మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ రఘుప్రసాద్, మాజీ సర్పంచు శ్రీనివాస్‌రెడ్డిలు పరిశీలించారు. సోమవారం వారు బుద్ధారం చెరువులో నీటి మట్టం పరిశీలించారు. బుద్ధారం చెరువు నిండితే బుద్ధారం మెయిన్ బ్రాంచ్ కెనాల్ నుంచి పెద్దమందడి మెయిన్ బ్రాంచ్ కెనాల్ ద్వారా పెద్దమందడి, ఘనపురం మండలాలకు సాగునీరు అందుతుందని, నీటి మట్టం పరిశీలించి నీటిని వదిలితే కెనాల్ వెంట వెళ్లి ఏమైనా సమస్యలు ఉన్నాయో పరిశీలించారు.

జోరందుకున్న వరి నాట్లు


మూలమల్ల గ్రామంలో వరి నాట్లు వేస్తున్న కూలీలు

ఆత్మకూరు, జూలై 29 : ఆత్మకూరు మండలంలో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ఎడమ కాలువ ద్వారా సాగునీటిని విడుదల చేయడంతో ఆయకట్టు పరిధిలోని వరి నాట్లు జోరందుకున్నాయి. ఎడమ కాలువ ఆయకట్టు పరిధిలో నందిమల్ల, మూలమల్ల, జూరాల తిప్పడంపల్లి, ఆరేపల్లి, కత్తెపల్లి, గుంటిపల్లి, వీర రాఘవపూర్, రేచింతల గ్రామాలలో వరి నాట్లు జోరుగా సాగుతున్నాయి. ఒకవైపు నాటు కూలీలు, మరో వైపు అంచులు తీయడానికి, కూలీలు గ్రామాలలో ప్రధాన కూడలి వద్ద సందడిగా మారింది. అలాగే ఆగస్టు చివరి వారం వరకు నాట్లు వేయనుండడంతో రెండు నెలల పాటు ఉపాధి లభించిందని కూలీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఒక్కసారిగా ఎడమ కాలువ ఆయకట్టు పరిధికి సాగునీటిని విడుదల చేయడంతో ఆయా గ్రామాలలో కూలీల కొరత ఏర్పడింది. దీంతో రైతులు పక్క గ్రామాల నుంచి వ్యవసాయ కూలీలను తీసుకువచ్చి నాట్లు వేయించుకుంటున్నారు.

కలప తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

వనపర్తి రూరల్, జూలై 29: కలప తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. రూరల్ ఎస్ఐ జలంధర్ రెడ్డి వివరాల మేరకు వనపర్తి పట్టణ కేంద్రంలోని శ్రీనివాసపూర్ శివారు ఫారెస్టు ప్రాంతంలో నుంచి ట్రాక్టర్‌లో కలప తరలిస్తున్నట్లు పక్కా సమాచారం మేరకు పట్టుకొని స్టేషన్‌కు తరలించాము. ఇతర సమాచారం మేరకు ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్‌ను వివరణ కోరగా ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ ప్రశాంత్ రెడ్డి పర్మిషన్ ఉందని తెలిపినట్లు రూరల్ ఎస్ఐ జలంధర్ రెడ్డి తెలిపారు.

రికవరీలో నిర్లక్ష్యం

- సెల్‌ఫోన్ల రికవరీపై శ్రద్ధ చూపని పోలీసులు
- 18 నెలల్లో 2,345 ఫోన్లు చోరీ
- కొత్త టెక్నాలజీ అందుబాటులోకి వచ్చినా నిర్లక్ష్యం
- ఇప్పటి వరకు 627 మాత్రమే రికవరీ

వనపర్తి క్రైం, జూలై 29: మనిషి జీవితంలో సెల్‌ఫోన్ భాగమైపోయింది. గ్రామీణ ప్రాంతాలు మొదలుకొని పట్టణాల వరకు వీటి వాడకం సర్వసాధారణమైంది. 80 శాతానికి పైగా స్మార్ట్ ఫోన్లు వాడుతున్నారు. ఒక్కో ఫోన్ కోసం రూ.10వేలు మొదలు కొని లక్ష దాకా వెచ్చిస్తున్నారు. ఇదే సమయంలో సెల్‌ఫోన్ల దొంగలు కూడా అధికమయ్యారు. ఐదారేళ్లుగా ఫోన్ దొంగతనాలు పోలీసులకు సవాల్‌గా మారాయి. అయితే సెల్‌ఫోన్ దొంగల ఆట కట్టించడంతో పాటు పోగొట్టుకున్న వాటిని రికవరీ చేసేందుకు కేంద్ర టెలికాం మంత్రిత్వ శాఖ నూతన టెక్నాలజీని అందుబాటులోకి తెచ్చింది. సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్యుప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) పోర్టల్ ద్వారా జిల్లా పోలీస్ విభాగం నుంచి పురోగతి సాధిస్తోంది. జిల్లాలో ఈ టెక్నాలజీ అందుబాటులో ఉన్నా సంబంధిత పోలీసులు రికవరీ చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నట్లు సమాచారం.

18 నెలల్లో 2,345 సెల్ ఫోన్లు చోరీ

జిల్లాలోని ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో గడిచిన 18 నెలల్లో 2,345 ఫోన్లు చోరీకి గురయ్యాయి. కొన్ని చోట్ల బాధితులు నేరుగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మరికొన్ని చోట్ల సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేశారు. ఎక్కువగా వనపర్తి, పెబ్బేరు, కొత్తకోట, ఆత్మకూరు బస్టాండ్లతో పాటు సంతల్లో చోరీకి గురవుతున్నాయి. చోరీకి గురైన ఫోన్లను సంబంధిత దొంగలు ఇతర ప్రాంతాలతో పాటు వేరే రాష్ట్రాలకు తీసుకెళ్లి తక్కువ ధరలో అమ్ముతున్నారు. జిల్లాలో చోరీకి గురైన సెల్‌ఫోన్ల రికవరీ బాధ్యతను ఆయా పోలీస్ స్టేషన్‌లో పని చేసే రైటర్లకు అప్పగించారు. గడిచిన 18 నెలల్లో 626 ఫోన్లను మాత్రమే రికవరీ చేసి బాధితులకు అందజేశారు. మిగతా 445 ఫోన్లు ట్రెస్ చేశారు. ఇటీవల ఎక్కువగా సెల్‌ఫోన్లు చోరీకి లేదా పోగొట్టుకున్న కూడా బాధితులు ఫిర్యాదు చేసేందుకు ముందుకు రావడం లేదు. పోయిన సెల్‌ఫోన్ రావడానికి మూడు నాలుగు నెలలు పోలీస్ స్టేషన్‌ల చుట్టూ తిరుగుతున్నా సరైన సమాధానం లేకపోవడంతో వెనకడుగు వేస్తున్నారు. కొత్త టెక్నాలజీ రాకముందు వచ్చాక ఒకేలా ఉందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


బాధితుడికి సెల్‌ఫోన్ అందజేస్తున్న ఆత్మకూరు ఎస్ఐ (ఫైల్)

అసహనం వ్యక్తం చేసిన ఎస్పీ

ఇటీవల ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఆర్ గిరిధర్‌రావు పోలీస్ శాఖలో సమూలంగా మార్పులు తీసుకువస్తున్నారు. బాధ్యతలు చేపటినప్పటి నుంచి ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో జిల్లాలోని సీఐలు, ఎస్ఐలు సంబంధిత పోలీస్ స్టేషన్ల రైటర్లతో టెలీకాన్ఫరెన్స్‌తో పలు సూచనలు చేస్తున్నారు. అందులో భాగంగా జిల్లాలోని ఆయా సీఐలు, ఎస్ఐలతో పాటు ఐటీ విభాగానికి సంబంధించిన సిబ్బందితో టెలీకాన్ఫరెన్స్‌లో సెల్‌ఫోన్ల రికవరీలో నిర్లక్ష్యం పట్ల మండిపడ్డారు. కొత్త టెక్నాలజీ అందుబాటులోకి వచ్చినా రికవరీ చేయడంలో ఎందుకు విఫలమయ్యారని ప్రశ్నించినట్లు సమాచారం. పెండింగ్‌లో ఉన్న సెల్‌ఫోన్ల రికవరీని వేగవంతం చేసి బాధితులకు అప్పజెప్పాలని హెచ్చరించినట్లు సమాచారం.

రికవరీ చేస్తున్నాం



సెల్‌ఫోన్ దొంగలు దొరకడం కొంత ఆలస్యం కావచ్చు. ఫోన్లు మాత్రం ఖచ్చితంగా దొరికే అవకాశం ఉంది. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా దొంగిలించిన ఫోన్లు ఎక్కడున్నా కనిపెట్టేందుకు వీలవుతుంది. సెల్‌ఫోన్‌లను రికవరీ చేసి బాధితులకు అందజేస్తున్నాం. త్వరలో పెండింగ్‌లో ఉన్న ఫోన్ల రికవరీ కూడా వేగవంతం చేసి చోరీకి గురైన వాటితో పాటు పోగొట్టుకున్న వారికి అందజేస్తాం.

- గిరిధర్ రావు, ఎస్పీ

బీజేపీ భావజాలాన్ని ఓడించేందుకు కృషి చేయాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్ వెస్లీ



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్ వెస్లీ

వనపర్తి టౌన్, జూలై 29: బీజేపీపై రాజకీయ, ఆర్థిక విమర్శలతోనే ఆగిపోకుండా బీజేపీ భావజాలాన్ని ఓడించేందుకు కృషి చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్లో సీపీఎం జిల్లా విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రస్తుతం దేశంలో మతోన్మాదం, మూఢ నమ్మకాలు పెచ్చరిల్లుతున్నాయని, వాటికి బీజేపీ ప్రతినిధిగా వ్యవహరిస్తోందన్నారు. మనుస్మృతి చట్టాల ప్రకారం పురుషాధిక్యత ఒక ధర్మమని, అలాంటి మనుస్మృతి అమలు చేసేందుకు బీజేపీ ప్రయత్నాలు చేస్తుందన్నారు. అంతేకాకుండా రిజర్వేషన్లు కూడా ఎత్తివేయాలనే ఆలోచనతో పాలన సాగిస్తున్నారని విమర్శించారు. రాజ్యాంగాన్ని మార్చాలనే దురుద్దేశంతోనే 370 సీట్ల లక్ష్యంతో ప్రచారం చేశారని, అదే గనుక జరిగి ఉంటే దేశం దేశంగా ఉండేది కాదని ఆవేదన వ్యక్తం చేశారు. సాంస్కృతిక, సామాజిక, విద్యా రంగాల్లో కృషి చేయాలని, ప్రత్యామ్నాయ భావాజాలంతో పని చేయాలని సూచించారు. ప్రత్యామ్నాయ సంస్కృతే సమాజ అభివృద్ధికి మార్గమని చెప్పారు. నేడు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో అభివృద్ధి చెందుతున్నప్పటికీ మనుస్మృతి ఆధారంగా మూఢనమ్మకాల పేరుతో ప్రజలను మోసం చేస్తున్న వైనాన్ని ఎండగట్టాలన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పుట్ట ఆంజనేయులు, బాల్‌రెడ్డి, మేకల ఆంజనేయులు, మహమూద్, నాగిరెడ్డి, ఉమ, కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కౌడి పీర్ల పండుగ

ఆత్మకూరు, జూలై 29: పట్టణంలోని రాజా వీధిలో ఏర్పాటు చేసిన కౌడి పీర్ల మహోత్సవం ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా కోట వీధిలోని మసీదులో ఇమామేమౌలాలి, ఇమామే జలాలి, ఇమామే ఖాసీం, ఇమామే హసన్‌అలం లను ప్రతిష్ఠించారు. సోమవారం గౌస్ సాహెబ్ ఆధ్వర్యంలో స్థానికులు, భక్తులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సాయంత్రం జరిగిన మొహర్రం వేడుకలు తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమానికి ఆత్మకూరు ఎస్ఐ నరేందర్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.


ఆత్మకూరు పట్టణంలో కౌడి పీర్లను ఊరేగిస్తున్న స్థానికులు

నేడే రూ.1.50 లక్షల రుణమాఫీ

- రైతు వేదికల్లో సంబురాలకు తరలిరావాలి

కొత్తకోట, జూలై 29: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు నేడు రూ.1.50 లక్షల రుణమాఫీ ప్రకటించనున్నది. ఈ శుభ సందర్భాన్ని పురస్కరించుకొని మంగళవారం సంబురాలు చేసుకునేందుకు రైతులు రైతు వేదిక భవనాలకు చేరుకోవాలని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అసెంబ్లీ ఆవరణలో రుణమాఫీ నగదును రైతుల బ్యాంకు ఖాతాల్లో జమా చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని వీక్షించడానికి మండలంలోని అమడబాకుల గ్రామ రైతు వేదికకు రైతులు రావాలని కోరారు.

24 గంటల్లో దొంగతనం కేసును ఛేదించిన ఖిల్లా పోలీసులు

ఖిల్లాఘణపురం, జూలై 29: వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలంలోని వెంకటంపల్లి గ్రామంలో జరిగిన దొంగతనం కేసును ఖిల్లాఘణపురం ఎస్ఐ శ్రీహరి ఆధ్వర్యంలో పోలీసులు 24 గంటల్లో ఛేదించినట్లు సోమవారం సీఐ రాంబాబు తెలిపారు. కొత్తకోట సీఐ ఎం.రాంబాబు కథనం ప్రకారం.. ఖిల్లాఘణపురం మండలం వెంకటంపల్లి గ్రామానికి చెందిన బోయ పార్వతమ్మ ఈ నెల 28న అదే ఊరిలో తన సొంత అన్న నగేష్ ఇంటిలోని ఇనుప పెట్టెలో రూ.1,40,000 భద్రపరుచుకుని పొలం పనులకు వెళ్లింది. పొలం నుంచి ఇంటికి వచ్చి చూస్తే డబ్బులు లేకపోవడంతో దొంగతనం జరిగిందని గుర్తించి ఖిల్లా ఘణపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు దొంగతనం కేసును ఛాలెంజ్‌గా తీసుకున్న ఖిల్లా పోలీసులు సోమవారం వెంకటంపల్లి గ్రామానికి చెందిన నిందితుడు చిలుక చెన్నయ్యను కస్టడీలోకి తీసుకుని విచారించారు. ఇంటి తాళాలు విరగ్గొట్టి తాను చేసిన నేరాన్ని ఒప్పుకొని దొంగతనం చేసిన సొమ్ములో రెండు వేల రూపాయలను ఖర్చు చేసి మిగిలిన డబ్బు చూపించాడు. పోలీసులు ఆ డబ్బును సీజ్ చేసి చిలుక చెన్నయ్యను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రాంబాబు తెలిపారు. చోరీ కేసును 24 గంటల్లో ఛేదించిన ఎస్ఐ శ్రీహరి, ఏఎస్ఐ నాగరాజు, హెడ్ కానిస్టేబుల్ బద్రినాయక్, శ్రీనివాసులు సిబ్బందిని సీఐ అభినందించారు.

చినుకు పడితే చిత్తడే


బురదమయంగా ఖిల్లాఘణపురం బస్టాండ్

ఖిల్లాఘణపురం, జూలై 29: చినుకు పడితే ఖిల్లాఘణపురం బస్టాండ్ ఆవరణ అంతా చిత్తడిగా మారుతోంది. చిన్నపాటి ముసురు కురిసినా బస్టాండ్‌లో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్ ఆవరణలో ఏర్పడిన గుంతలో నీరు నిలువడంతో ఎక్కడ గుంతలు ఉన్నాయో తెలియక ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. బస్టాండ్ ప్రాంగణం సీసీ వేయక పోవడంతో బస్టాండ్ ప్రాంతం గుంతలమయంగా మారిందని ప్రయాణికులు వాపోతున్నారు. నీటి గుంతల్లో మట్టిని నింపడం సర్వసాధారణంగా మారడంతో బస్టాండ్ ఆవరణ గుంతలలో వర్షపు నీరు నిలిచి మడుగులను తలపిస్తోంది. బస్టాండ్‌లో నిలిచి ఉండే ప్రయాణికుల దుస్తులు బురద మయంగా మారడంతో పాటు దుర్గంధం వెదజల్లుతోంది.

ప్రజాప్రతినిధులు స్పందించి బస్టాండ్ ఆవరణలో సీసీ వేయాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

రేవల్లి, జూలై 29: మండలంలోని శానాయిపల్లిలో ఆదివారం రాత్రి తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. ఎస్ఐ రాము తెలిపిన వివరాల ప్రకారం.. శానాయిపల్లి గ్రామానికి చెందిన శ్రీశైలం ఇల్లు వర్షాలకు ఒకపక్క కొద్దిగా కూలిపోయింది. దీంతో వారు ప్రతీ రోజు రాత్రి ఇల్లు తాళం వేసి పక్కనే ఉన్న ఆయన అక్క ఇంట్లో పడుకునేవారు. రోజులానే ఆదివారం రాత్రి తాళం వేసి వెళ్లారు. ఉదయం వచ్చే సరికి తాళం పగలగొట్టి ఇంట్లో బీరువా లాకర్‌లో ఉన్న రూ.80 వేలు దొంగిలించి మళ్లీ అదే తాళం సరిచేసి వెళ్లారు. సోమవారం ఉదయం తాళం తీస్తు గుర్తించిన శ్రీశైలం భార్య భగనమ్మ బీరువా దగ్గరికి వెళ్లి చూడగా అందులో ఉన్న డబ్బు కనిపించలేదు. దీనిపై సోమవారం శ్రీశైలం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాము తెలిపారు. ఇందులో పగిలిన తాళం మళ్లీ వేయడం గమనించదగ్గ విషయమని ఎస్ఐ అన్నారు.

చట్టాలపై ప్రజలకు అవగాహన

పెబ్బేరు రూరల్, జూలై 29: చట్టాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని తోమాలపల్లిలో చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామంలో యువకులు, ప్రజలు కలిసిమెలిసి ప్రశాంతంగా జీవనం కొనసాగించాలన్నారు. క్షణికావేశంలో ఘర్షణపడి కేసులు చేసుకోవద్దన్నారు. ఈ గ్రామంలో జాతీయ రహదారి ఉందని, వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. దీంతో పాటు నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాల పట్ల జాగ్రత్త వహించాలని, సెల్‌ఫోన్ వాడకంలో పలు జాగ్రత్తల గురించి ప్రజలకు వివరించారు. ప్రజలు ఐక్యమత్యంతో ఉండి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఎస్ఐ కోరారు. కార్యక్రమంలో ఏఎస్ఐ శ్రీనివాసులు గౌడ్, మాజీ సర్పంచు సురేందర్‌గౌడ్, నాయకులు రామన్‌గౌడ్, రాముడు, రంగన్న, గ్రామ యువకులు, ప్రజలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

చిన్నంబావి, జూలై 29: సైబర్ నేరం జరిగిందా.. వెంటనే 1930కు కాల్ చేయండి, ఈ కాల్ సెంటర్ 24/7 అందుబాటులో ఉంటుందని ఎస్ఐ రమేష్ తెలిపారు. సోమవారం మండలంలోని బెక్కెం గ్రామంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ప్రతీనిత్యం రాష్ట్రవ్యాప్తంగా వందలాది సైబర్ నేరాలు జరుగుతున్నాయి. బాధితులు సైబర్ క్రైం కాల్ సెంటర్ టోల్ ఫ్రీ నంబరు 1930కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. గతంలో ఫిర్యాదు చేసిన వారి నుంచి కేసుల పురోగతిలో ఉన్నాయని తెలిపారు. అంతేకాకుండా సైబర్ నేరాలకు సంబంధించి బాధితులు డయల్ 100కు కాల్ చేసినా ఆ కాల్ నేరుగా సైబర్ క్రైం కాల్ సెంటర్‌కు వచ్చే విధంగా టెక్నాలజీ అందుబాటులో ఉందని ఆయన తెలిపారు. అనంతరం బెక్కెం గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఈదన్న యాదవ్, మందడి కృష్ణ, రైతు కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ రోజు రక్త పరీక్షలు చేయాలి

పెబ్బేరు రూరల్, జూలై 29: మండలంలోని శాఖాపురంలో సోమవారం వైద్య శాఖ ఆధ్వర్యంలో వైరల్ ఫీవర్‌పై ఇంటింటి సర్వేచేసి గ్రామంలోని ప్రజల రక్త నమూనా తీసుకున్నట్లు ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. వైరల్ ఫీవర్ ఉన్నట్లు తమకు సమాచారం రావడంతో అనుమానితుల రక్త నమూనాలు సేకరించి వైద్యం చేసినట్లు ఆయన తెలిపారు. అవసరం ఉన్న రోగులకు మందులు ఇచ్చినట్లు తెలిపారు. ఈ గ్రామంలో ప్రతీ రోజు పరీక్షలు నిర్వహించాలని వైద్య సిబ్బందికి ఆదేశించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ తిరుపతయ్య, ల్యాబ్ టెక్నీషియన్ వెంకటేష్ ఉన్నారు.

చెప్పులు కుట్టే కార్మికులను ఆదుకోవాలి

- ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ

వనపర్తి టౌన్, జూలై 29: జిల్లా కేంద్రంలో ఏళ్లుగా రోడ్డు పక్కన చెప్పులు కుట్టుకుంటూ జీవనం సాగిస్తున్న కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో స్నేహ ఫుట్‌పాత్ వర్కర్స్ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని రాజీవ్ చౌరస్తా, మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్, గాంధీచౌక్, కొత్తబస్టాండ్, పాత బస్టాండ్ తదితర ప్రాంతాల్లో రోడ్ల పక్కన ఎండకు వానకు తడుస్తూనే కార్మికులు జీవనం సాగిస్తున్నారని అన్నారు. రోజంతా కష్టపడ్డా కనీసం వంద రూపాయల ఆదాయం కూడా సంపాదించని దుర్భర స్థితితో జీవితాలను వెల్లదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చెప్పులు కుట్టే కార్మికులకు పనిముట్లు, ముడి సరకు (లెదర్) బ్యాంకుల నుంచి రుణాలు, నీడ కోసం షెడ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ పట్టణ కార్యదర్శి రమేష్, నాయకులు శాంతన్న, నజీర్, వెంకటేశ్వర్లు, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గోపాలకృష్ణ

తల్లిదండ్రులు పిల్లల పట్ల బాధ్యతగా మెలగాలి

అమరచింత, జూలై 29 : ఆకతాయిల వెకిలి చేష్టలు, పిల్లల పట్ల తల్లిదండ్రుల బాధ్యతలపై సోమవారం జూరాల ప్రాజెక్టుపై షీ టీం పోలీసులు అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఆదేశానుసారం షీ టీం పోలీసు ఈవ్‌టీజింగ్ జరగకుండా అక్కడ పర్యాటకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాలలు, కళాశాలలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పాఠశాలలు, కళాశాలల వద్ద, దేవాలయాలు, సందర్శన స్థలాల వద్ద వెకిలి చేష్టలు చేయకుండా ప్రతీ ఒక్కరు అరికట్టాలని కోరారు. తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల బాధ్యతగా మెలగడంతో పాటు సమాజం గురించి వారికి అవగాహన కల్పించాలని సూచించారు. ఎవరైనా ఈవ్‌టీజింగ్‌కి పాల్పడితే షీ టీం నెంబరు 6303923211, డయల్ 100, సైబర్ క్రైం 1930 నంబర్లకు డయల్ చేయాలని సూచించారు. జూరాల ప్రాజెక్టుపై వెళ్లేటపుడు నీటి ప్రవాహం దృష్టిలో ఉంచుకుని వారి వారి పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని తెలిపారు. ఈ అవగాహన సదస్సులో హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, రాములు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



జూరాల ప్రాజెక్టుపై సందర్శకులకు అవగాహన కల్పిస్తున్న షీ టీం పోలీసులు